క్లుప్తంగా

నేడు అధికారుల సమన్వయ సమావేశం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి రంగుల మహోత్సవం, పెద్ద తిరునాళ్ల పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మవారి సత్రాల ఆవరణలోని కల్యాణ మండపం వద్ద నందిగామ ఆర్డీవో పి.సాయిబాబు అధ్యక్షతన అధికారుల సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రారంభమయ్యే రంగుల ఉత్సవానికి సంబంధించి నిర్వహించే ఈ సమావేశానికి అధికారులంతా తప్పక హాజరు కావాలన్నారు.అలాగే ఉదయం 1 గంటలకు ఆలయ ట్రస్ట్ బోర్డు హాల్ నందు ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది అందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

పశుపోషకులకు అవగాహన

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక గ్రామీణ పశువైద్యశాల వద్ద పశువుల్లో వచ్చే గాలికుంటువ్యాధి, నివారణా చర్యలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పి.అనిల్ మాట్లాడుతూ పశువుల పాకల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువులకు చికిత్సలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, ఎంపీడీవో హర్షసాయి, నీతి ఆయోగ్ కో-ఆర్డినేటర్ సందీప్, ప్రభు, కేవీకె శాస్త్రవేత్త డాక్టర్ జశ్వంత్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సంగమేశ్వరునికి రూ.1.13లక్షల ఆదాయం

నందిగామ టౌన్: మండలంలోని దాములూరు కూడలిలో వేంచేసియున్న పార్వతీసమేత సంగమేశ్వరస్వామి వారికి పదినెలల కాలానికి హుండీ ద్వారా రూ. 1.13లక్షల ఆదాయం వచ్చిందని ఈవో వాసిరెడ్డి భూపాల్, ఆలయ చైర్మన్ కనగాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ ఆవరణలో బుధవారం హుండీని లెక్కించారు. జగ్గయ్యపేట గ్రూప్ టెంపుల్స్ ఈవో వైష్ణవి, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

11మంది జూదరుల అరెస్ట్

నందిగామ టౌన్: మండలంలోని ఐతవరంలో పేకాట శిబిరంపై బుధవారం దాడిచేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5200 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. పండుగల పేరుతో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: పేకాటతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని జయంతి గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం ఆయన తనసిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.2,700 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



కంచికచర్ల : ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువచ్చినా, విక్రయించినా కేసు నమోదు చేస్తామని కంచికచర్ల ఎస్ఐ పీవీఎస్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోనీ కీసర టోల్‌ప్లాజా వద్ద నేషనల్ హైవేపై బుధవారం ఆయన విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన పూరిల్లు సురేష్ అనేవ్యక్తి తన కారులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన మద్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. ఆరు ఫుల్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు

- సీఎం జగన్ మార్కు పాలన
- ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందజేత
- సచివాలయ వ్యవస్థతో పారదర్శకత
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు ఉద్ఘాటన



లచ్చపాలెం గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాలు పొందాలంటే టీడీపీ నాయకుల ఇళ్లచుట్టూ తిరగాల్సి వస్తే...ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాత్రం అర్హుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామ శివారు లచ్చపాలెం గ్రామంలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన ఆయనకు మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు పూర్తి నిరాదరణకు గురయ్యాయని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీవర్గాలకు మంత్రితోపాటు ఉపముఖ్యమంత్రి పదవిని సైతం కట్టబెట్టి సముచితస్థానం కల్పించారని వివరించారు. అంతే కాకుండా అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా సంక్షేమ పథకాలు అందించి అండగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో పాలనలో పారదర్శకత పెరగడంతోపాటు ఆయా వార్డు, గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందుతున్నాయన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర, 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసి చెప్పాడంటే చేస్తాడంతే అనేట్లుగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికలలో సైతం అండగా ఉండి పూర్తి మద్దతు పలికి ఘనవిజయం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, నెలకుదిటి శివనాగేశ్వరరావు, సూరా కృష్ణ, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ7.5లక్షలు మంజూరు



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న విప్ సామినేని ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువు బజారులో శ్రీసీతారామాలయం అభివృద్ధికి టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.7.5లక్షల చెక్కును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు సామినేని ఉదయభాను బుధవారం ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. తదితరులకు అందజేశారు. ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో దేవాలయాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సామినేని ఉదయభానును ఆలయ కమిటీ సభ్యులు ఓర్సు చిన్నా, బత్తుల బుజ్జి, వేముల నాగ, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పఠాన్ ఫిరోజ్‌ఖాన్ ఘనంగా సత్కరించారు. ఆలయ అభివృద్ధికి సహకరించారంటూ ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంబేడ్కర్‌కు ఘననివాళి



జనభాగీదరి కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ వట్టెం మనోహర్ తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 19వ తేదీన విజయవాడలో జరిగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం, స్మృతి వనం ప్రారంభోత్సవానికి ప్రజలంతా తరలిరావాలని జగ్గయ్యపేట వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఐదో సచివాలయం వద్ద బుధవారం సామాజిక సమతా సంకల్పం, జనభాగీదరి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ బాటలో పయనిస్తామంటూ సంతకాల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గం అందరికీ ఆచరణీ యమని పేర్కొన్నారు. అంతటి మహోన్నతవ్యక్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. కౌన్సిలర్ వట్టెం మనోహర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఏసీపీ జనార్దన్ నాయుడు



పేటలో విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ జనార్దన్‌నాయుడు

జగ్గయ్యపేట: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని నందిగామ ఏసీపీ జనార్దన్ నాయుడు హెచ్చరించారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఎవరైనా కోడిపందేలు, పేకాటతోపాటు ఇతర జూద క్రీడలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. కోడి కత్తుల తయారీదారులు, పేకాట, కోడి పందేల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేయడంతోపాటు నియోజకవర్గంలో 614మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. గతంలో పందేలు నిర్వహించిన ప్రాంతాలు, వ్యక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేశామన్నారు. పందేల నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంక్రాంతికి సంప్రదాయ క్రీడలను నిర్వహించుకోవాలని సూచించారు. పందేల నిర్వహణను అడ్డుకునేందుకు జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో సైతం పందేలు నిర్వహిస్తుంటే సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర సరిహద్దు గరికపాడు చెక్‌పోస్టులో తనిఖీలు ముమ్మరం చేశామని గండ్రాయి, మల్కాపురం, వత్సవాయి తదితర గ్రామాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సీఐ జానకిరామ్, ఎస్ఐ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



ఇమ్మాక్యులేటివ్ కళాశాలలో పాలపొంగళ్లతో అధ్యాపకులు, విద్యార్థులు



భోగి మంటలు వేస్తున్న ఇమ్మాక్యులేటివ్ కళాశాల అధ్యాపకులు



విద్యార్థులు వేసిన ముగ్గును పరిశీలిస్తున్న హెచ్‌ఎం సిస్టర్ రాజమణి

కంచికచర్ల : స్థానిక ఇమ్మాక్యులేటివ్ డిగ్రీ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు.

హిందూ సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో భోగి మంటలు వేశారు. గొబ్బెమ్మలు పెట్టి ఆడిపాడారు. రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు పండుగల విశిష్టత, హిందూ సంప్రదాయాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ రాజమణి, కీసర ప్రొవెన్సిలేట్ సిస్టర్ జాన్‌రోస్ లిన్, కాలేజీ కరస్పాండెంట్ సిస్టర్ మార్టియన్, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. సామాజిక న్యాయం మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజాప్రతినిధులతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో జరగనున్న సామాజిక న్యాయం మహాశిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రతిఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇప్పటివరకు ఏ ప్రభుత్వంలో దక్కని గౌరవం, సముచిత స్థానాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. మంత్రి పదవుల తోపాటు ఉప ముఖ్యమంత్రి పదవిని సైతం కట్టబెట్టిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మునుపెన్నడూ ఏ ముఖ్యమంత్రి తీసుకోని సంచలన నిర్ణయం తీసుకుని నామినేటెడ్ పదవుల్లో సైతం అట్టడుగు వర్గాలకు 50శాతం రిజర్వేషన్‌లు కల్పించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన బాటలో నడుచుకుంటూ నిమ్నజాతుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునచ్చారు. సమావేశంలో నందిగామ మున్సిపల్ వైస్‌చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, ఓర్సు జ్వాలా, నాయుడు ఉదయలక్ష్మి, వైఎస్ఎన్ ప్రసాద్, షేక్ కరిముల్లా, యాకుబ్ అలీ, షేక్ ఖాలిక్, రామారావు, జాఫర్, యాదాల దాసు, పాపట్ల స్వామి, మందా మరియమ్మ, బాపట్ల సాంబయ్య, అనుమోలు పార్థసారథి, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

నందిగామ టౌన్:ప్రకృతి వ్యవసాయంపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని రైతు సాధికార సంస్థ ఎస్ఎఫ్ఏ అంజిరెడ్డి సూచించారు. స్థానిక వైఎస్సార్ కాంతి పథం కార్యాలయంలో బుధవారం డివిజన్ స్థాయి ప్రకృతి వ్యవసాయ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024–25కు సంబంధించి ప్రకృతి వ్యవసాయంపై ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు అని వివరించారు. ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి ఏపీఎం, సీసీలు, వీవోఏలు, రైతుల నుంచి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేయుటకు అవలంభిస్తున్న పద్ధతులు, ప్రస్తుతం ఉన్న మార్కెటింగ్ అవకాశాలను రైతులకు వివరించారు.

ఉత్సాహంగా క్రీడా సంబరాలు



క్రీడాకారులతో పేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు



వత్సవాయిలో పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు దేవమణి, రమాదేవి, సీతమ్మ



వాలీబాల్ ఆడి మండలస్థాయి పోటీలను ప్రారంభిస్తున్న వీరులపాడు ఎంపీపీ కోటేరు లక్ష్మి



పెనుగంచిప్రోలులో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు



పేటలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారుణులు



గండేపల్లిలో టాస్ వేస్తున్న ఉపాధ్యాయులు

పెనుగంచిప్రోలు: మండలస్థాయి ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. సచివాలయం స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్న ఈ పోటీలను ఎంపీడీవో హర్షసాయి ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పీడీ వేగినేటి వెంకటరమణ, బాబూప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను తీర్చిదిద్దేందుకే ...

జగ్గయ్యపేట అర్బన్: క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పోటీపడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ యువతను క్రీడలవైపు ప్రోత్సహించి క్రీడారంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని, తద్వారా జగ్గయ్యపేట ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. తొలిరోజు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నాఉ. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ కొలగాని రాము, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో మేకా రమేష్‌బాబు, పీడీలు ఎం.శ్రీనివాసరావు, గంటా వెంకటేశ్వర్లు, సరోజ, సునీత, నాగేశ్వరరావు, సోడానాయక్, ఫిలిప్, కృష్ణ, మణిరత్నం పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలు బుధవారం వత్సవాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. పోటీలను జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, ఎంపీపీ కొలుసు రమాదేవి, సర్పంచ్ భూక్యా సీతమ్మ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారికి అభినందనలు తెలిపారు. మొత్తం 108 టీములు కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, యేశపోగు శ్రీనివాస్, కొలుసు తిరుపతిరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

జుజ్జూరు(వీరులపాడు): క్రీడలతో శారీరకంగా, మానసికంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఎంపీపీ కోటేరు లక్ష్మీ పేర్కొన్నారు. జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారన్నారని వివరించారు. తొలుత ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. సర్పంచి రమావత్ కోటి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఉప సర్పంచ్ పసుపులేటి సాయిబాబు, వైస్ ఎంపీపీ నాగుల్‌మీరా, పీఏసీఎస్ చైర్మన్ పూలా రాంబాబు, ఎంఈవో కెనడీ, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని గొట్టుముక్కల, గండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో బుధవారం జరిగిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్ మాట్లాడుతూ క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంచికచర్ల, పెండ్యాల, మోగులూరు, గనిఆత్కూరు, పరిటాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోటీలు జరుగుతున్నాయని ఎంపీడీవో కే శిల్ప తెలిపారు. కార్యక్రమంలో గండేపల్లి పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, నాయకులు గుదే అక్కారావు, తంగెళ్లమూడి రామారావు, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నెట్టెం రాఘురాం

జగ్గయ్యపేట:సంక్రాంతి పండుగ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకని మాజీమంత్రి నెట్టెం రఘురాం పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో కాకతీయ కమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేస్తుందన్నారు. అదేవిధంగా కమ్మ పేద విద్యార్థులకు 67 మందికి రూ.5.36 లక్షలను అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు గింజుపల్లి వెంకట్రావ్, ఇంటూరి రంగనాయకులు, కళ్యాణం కోటేశ్వరరావు, సుబ్బారావు, మువ్వా శ్రీదేవి, పర్వతనేని రత్నకుమార్, జానకిరామయ్య, యలమంచిలి లక్ష్మి, ఇంటూరి లత పాల్గొన్నారు. .

86 మందికి వైద్యపరీక్షలు



గండేపల్లిలో రక్త పరీక్షలు చేస్తున్న సీహెచ్‌వో రష్మి

కంచికచర్ల : బోదకాలు నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండేపల్లిలో బుధవారం రాత్రి గ్రామస్తులకు రక్త పరీక్షలు చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జె.రష్మి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ప్రజల నుంచి రక్తనమూనాలు సేకరించి, పరీక్షలు చేశారు. దోమకాటు కారణంగా బోదకాలు సంభవిస్తుందని, ప్రజలు బోదకాలు బారినపడకుండా ప్రభుత్వం రక్తపరీక్షలు చేయడంతోపాటు మందులు కూడా పంపిణీ చేస్తుందని డాక్టర్ రష్మి తెలిపారు. మొత్తం 86మందికి రక్తపరీక్షలు చేసినట్లు వివరించారు. వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.